

- అపజయాలను తప్పటడుగులని
ఎప్పుడూ అనుకోవద్దు.. అవి తప్పులు కావు..
భవిష్యత్తులో మనమేం చేయొద్దో తెలిపే పాఠాలు

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 21 | ఆదివారం 15 జూన్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## మూడు దేశాల్లో పర్యటించనున్న ప్రధాని

- కెనడా వేదికగా జరిగే జీ7 దేశాల కూటమి సమావేశానికి హాజరవ్వనున్న మోదీ



**న్యూఢిల్లీ - సూర్యవాస్తవం, జూన్ 14**

కెనడా వేదికగా జరిగే జీ7 దేశాల కూటమి సమావేశానికి ప్రధాని మోడీకి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో జూన్ 16-17 తేదీల్లో కెనడాలోని కననాస్కిస్‌లో జరిగే జీ-7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

- మిగతా 2లో..



# అహ్మదాబాద్ విమాన ప్రమాదం

## - 274 కి పెరిగిన మృతుల సంఖ్య

**అహ్మదాబాద్ - సూర్యవాస్తవం, జూన్ 14**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 274కు చేరినట్లు తాజాగా అధికారులు వెల్లడించారు. విమానం బీజే మెడికల్ కాలేజీ భవనంపై కూలింది. ఇందులో తొలుత 24 మంది మృతి చెందినట్లు సమాచారం రాగా.. ఇప్పుడా సంఖ్య 33కు పెరిగింది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న మరో 9 మంది మెడికోలు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో విమాన ప్రమాదంలో మృతుల సంఖ్య మొత్తం 274కు చేరింది.



## ఆ నిర్ణయం సిగ్గుచేటు

- ప్రియాంక గాంధీ



**హైదరాబాద్ - సూర్యవాస్తవం, జూన్ 14**

గాజా-ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ జరగాలని ఐక్యరాజ్యసమితి ఓటింగ్ నిర్వహించింది. ఈ ఓటింగ్‌కు భారత్ హాజరకాలేదు. ఈక్రమంలో భారత్ ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో ఇజ్రాయిల్ మారణోమం సృష్టిస్తుందని వాపోయారు. మారణకాండను కట్టడి చేయడానికి అంతర్జాతీయ సంస్థ ముందడకు వేస్తే.. కేంద్ర ప్రభుత్వం అర్థంలేని

- మిగతా 2లో..

## సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది

- వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- 'తల్లికి వందనం' నిధులపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని లోకేశ్ సవాల్
- గడువు ముగిసినా జగన్ రుజువులు చూపలేదని, క్షమాపణ చెప్పలేదని వెల్లడి
- చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- శరణమా, న్యాయ సమరమా తేల్చుకోవాలని జగన్‌కు సూచన

**అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 14**

ఏపీ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. జగన్ చేసిన ఆరోపణలపై సవాల్ విసిరితే స్పందన కరవైందని, ఇది ఆయన వైఖరికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు. "సవాల్ చేస్తే సౌండ్ ఆఫ్!" అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

"బురద చల్లడం పారిపోయి ప్యాలెస్‌లో దాక్కోవడం జగన్ గారికి అలవాటు. తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వెళ్ళాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని ఛాలెంజ్ చేసాను. సమయం ముగిసింది, రుజువు చెయ్యలేదు, క్షమాపణ కోరలేదు.



అందుకే మిమ్మల్ని ఫేకు జగన్ అనేది. లీగల్ యాక్షన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమరమా? తేల్చుకోండి"

- మిగతా 2లో..

# అవినీతిలేని రాష్ట్రంగా ఏపీ

- ప్రజాసమస్యలపై దృష్టి
- ఆరోపణలు వస్తే తక్షణ విచారణ
- 10 ముఖ్యమైన సమస్యలపై దృష్టి పెట్టాలి
- ఐవిఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణ సమీక్షలో సిఎం చంద్రబాబు

**అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 14:**

అవినీతి లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టాలని, ఏశాఖలో అవినీతి ఆరోపణ వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను హెచ్చరించారు. ఐవిఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణపై శనివారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం సమీక్ష నిర్వహించారు. కూటమి పాలనపై ఏడాది కాలంలో సంతృప్తి వ్యక్తమైనట్లు అధికారులు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీ, అన్నా క్యాంటీన్లు, ఇసుక, చౌకదుకాణాలు, ఆస్పత్రి, మున్సిపల్, ఆలయాల, ఎపిఎస్ఆర్‌టిసికి సంబంధించిన సేవలపై ప్రజాభిప్రాయాలతో కూడిన వివరాలను అధికారులు సిఎంకు వివరించారు. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు, దీపం, గంజా, డ్రగ్స్ వంటి అంశాలపైనా వివరాలు తెలిపారు. మహిళలపై హింసకు సంబంధించి పబ్లిక్ ప్రాంతాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం తెలిపారని, పోలీసుల స్పందన బావుందని 59.5 శాతం మంది తెలిపారని



వివరించారు. గంజాయికి సంబంధించి 27.4 శాతం మంది తమ ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నట్లు నివేదికలో తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా

- మిగతా 2లో..



## జూన్ 19న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర

- రోదసిలోకి వెళ్లనున్న మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లు

2లో

# జగన్ పర్యటనలో రాళ్ల దాడి

- వైసీపీ ఎమ్మెల్యే బూచేపల్లికి నోటీసులు, మరో 15 మంది అరెస్ట్
- ఈ నెల 11న పొదిలిలో పర్యటించిన జగన్
- వైసీపీ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడికి పాల్పడినట్టు ఆరోపణలు
- ఎమ్మెల్యే బూచేపల్లికి పోలీసుల నోటీసులు, కొనసాగుతున్న అరెస్టులు

**పొదిలి-సూర్యవాస్తవం, జూన్ 14**

ప్రకాశం జిల్లా పొదిలిలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా, మరో 15 మంది వైసీపీ కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఈనెల 11వ తేదీన మాజీ జగన్ పొదిలి పర్యటనకు వచ్చినప్పుడు శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిందని పోలీసులు గుర్తించారు. వైసీపీ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. జగన్ పర్యటన రోజున వైసీపీ కార్యకర్తలు బారికేడ్లను తొలగించి బలవంతంగా తోసుకుని వచ్చారని పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే బూచేపల్లికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా



ప్రైవేటు వాహనాలు హెలీప్యాడ్ వరకు వచ్చాయని, పట్టణంలో శాంతియుతంగా ఉన్న ఇతర పార్టీల కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడికి ప్రయత్నించి చెప్పులు, రాళ్లు విసిరారని నోటీసులో పేర్కొన్నట్టు వివరించారు. ఈ

- మిగతా 2లో..



## రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడా..?

- పొదిలి పర్యటనలో ఉసిగొల్పి, రాళ్లు విసిరి గలాటా చేయించారు

- వైఎస్ జగన్

**పొదిలి -సూర్యవాస్తవం, జూన్ 14**

రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడి చేయించారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఈరోజు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ ట్వీట్ చేశారు. పొగాకు పంటకు కనీస మద్దతు ధరలు లభించక రైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలోని పొదిలిలో రైతులను పరామర్శించి భరోసా చెప్పేందుకే తాను అక్కడికి వెళ్లానని జగన్

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# మూడు దేశాల్లో పర్యటించనున్న ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్వయంగా మోడీకి ఫోన్ చేసి ఆహ్వానించారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత కెనడా-భారత్ మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ పరిణామాల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ కెనడా వెళ్తున్నారు. అంతేకాకుండా కెనడాతో పాటు ప్రధాని మోడీ సైప్రస్, క్రొయేషియా దేశాల్లో కూడా పర్యటిస్తారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో, ఇంధన భద్రత, సాంకేతికత ఆవిష్కరణలతో సహా కీలకమైన ప్రపంచ సమస్యలపై భారతదేశం యొక్క వైఖరిని ప్రధాన మంత్రి భారత వైఖరి తెలియచేస్తారని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 15 నుంచి 16 వరకు మోడీ సైప్రస్ పర్యటనలో ఉంటారు. ఆ తర్వాత 16-17 వరకు జీ-7 సమావేశంలో పాల్గొంటారు. దీని తర్వాత జూన్ 18న క్రొయేషియాలో పర్యటిస్తారు.

# ఆ నిర్ణయం సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుందని, ఇది సిగ్గుచేటు అని ఆమె శనివారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మండిపడ్డారు. బెంజమిన్ నెతన్యాహు ఒక దేశాన్ని మొత్తం నాశనం చేస్తుండగా భారతదేశం నిశ్శబ్దంగా నిలబడటమే కాకుండా ఇరాన్‌పై దాడి చేసి, దాని సార్వభౌమత్వాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తుందని, అన్ని అంతర్జాతీయ నిబంధనలను ఇరాన్ పూర్తిగా బేఖాతరు చేస్తుందని ఆమె ఆరోపించారు. గాజాలో ఎక్కువ మొత్తంలో మహిళలు, చిన్నారులు చంపబడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన ప్రపంచ నాయకత్వం న్యాయాన్ని కాపాడుకోవడానికి ధైర్యాన్ని కోరుతుందని, మనం మానవత్వం కోసం తమ గొంతును తిరిగి పొందాలి, సత్యం అహింస కోసం నిర్భయంగా నిలబడాలని ఆమె పిలుపునిచ్చారు.

ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం విరమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో ఓటింగ్ జరిగింది. దీనికి భారత్ గైర్హాజరు అయింది. ఈ ఓటింగ్‌లో 149 దేశాలు ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు వేశాయి. అమెరికా, ఇజ్రాయిల్ తో పాటు 10 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ సహా మరో 19 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. దక్షిణాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓ దేశాల్లో భారత్ ఒక్కటే ఓటింగ్ కి దూరంగా ఉంది. గత డిసెంబర్ 2024లో ఇటువంటి ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు వేసిన భారత్, ఆరు నెలల తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం.

# అవినీతిలేని రాష్ట్రంగా ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి సారించాలని తెలిపారు. రుజువైతే తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిట్ జరపాలని సిఎం అధికారులకు సూచించారు. సమస్యలు ఉన్నచోట సంతృప్తి పెరిగేలా చూడాలని తెలిపారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. వర్క్ఫ్రం హోమ్, పెట్టుబడులరాక, నైపుణ్య శిక్షణతో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో తెలపాలన్నారు. 175 నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహించడంతోపాటు ఆగస్టు 15 కల్లా అన్ని సేవలనూ వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. మరోవైపు వికలాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించడం మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలని అన్నారు. చౌకధరల దుకాణాలను పెంచడం, లేదంటే కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్దిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇసుక సరఫరాలో ప్రజల్లో ఉన్న అంసతృప్తిపైనా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది

(మొదటిపేజీ తరువాయి)

అంటూ జగన్ కు లోకేశ్ అల్టిమేటమ్ జారీ చేశారు.

ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు, మిగతా రూ.2 వేలు పాఠశాలలు/కాలేజీల అభివృద్ధి నిధుల నిమిత్తం ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే, ఈ రూ.2 వేలు మంత్రి నారా లోకేశ్ జేబులోకి పోతున్నాయంటూ వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేశ్ సవాల్ విసిరారు.

# జగన్ పర్యటనలో రాళ్ల దాడి

(మొదటిపేజీ తరువాయి)

దాడుల్లో పోలీసులు కూడా గాయపడ్డారని, వారి విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. పొగాకు బోర్డు కార్యాలయంలోకి కూడా కార్యకర్తలు చొరబడి బేళ్లను తొక్కి ఆస్తినష్టం చేశారని ఆరోపించారు. జరిగిన ఘటనలకు బాధ్యత వహించాల్సిన స్థాయిలో ఉన్నందున, మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యేను నోటీసు ద్వారా కోరినట్లు సీఐ వివరించారు.

**అరెస్టుల పర్వం**

మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి అరెస్టుల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, శనివారం మరో 15 మందిని అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 24కు చేరింది. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# జూన్ 19న శుభాంశుశుక్లా అంతరిక్ష యాత్ర

**- రోదసిలోకి వెళ్లనున్న మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లు**

**బెంగళూరు - సూర్యవాస్తవం, జూన్ 14**

శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు సంబంధించి కొత్త తేదీని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. శుభాంశు జూన్ 19న రోదసియాత్రకు బయలుదేరనున్నట్లు ఇస్రో తెలిపింది. యాక్సియం-4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లు రోదసిలోకి వెళ్లనున్నారు. కాగా సాంకేతిక సమస్యలతో ఈ రోదసియాత్ర భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన సంగతి తెలిసిందే. ఈనెల 11న ప్రయోగానికి ముందు రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు గుర్తించిన అధికారులు ప్రయోగాన్ని నిలిపివేశారు. ఈ సమస్యను విజయవంతంగా పరిష్కరించామని ఇస్రో వెల్లడించింది. ఈనేపథ్యంలో కొత్త ప్రయోగ తేదీని ప్రకటించింది.

# నేతన్నలకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు

**విజయవాడ - సూర్యవాస్తవం, జూన్ 14**



వేలాది మంది నేతన్నలకు లబ్దిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచేలా ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదే విషయాన్ని రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. సాంప్రదాయ చేనేత రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపుగా 1,036 చేనేత సహకార సంఘాలున్నాయని, వాటిలో 89 వేల మగ్గం నేత కార్మికులు ఉన్నారన్నారు. వీరందరికీ ఆర్థికంగా ఊతం ఇచ్చే విధంగా, వారి జీవనోపాధి మెరుగుపడే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీలను గణనీయంగా పెంచడం జరిగిందన్నారు. ఏపీసీవోకు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సంఘాలు కింద పనిచేసే నేత కార్మికులకు వేతనాలు మరియు ఛార్జీల పెంపు వర్తిస్తుందన్నారు. బ్లీచింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.129 నుంచి రూ.148లకు (15%), డైయింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.362 నుంచి రూ.434లకు (20%) పెంచారు. ఇక బెడ్‌షీట్ నేత మజూరి రూ.83 నుంచి రూ.100లకు (20%) మరియు టవల్ నేత మజూరి రూ.31 నుంచి రూ.40లకు (30%) పెంచడం జరిగిందని మంత్రి వివరించారు. ఫలితంగా ఒక్కో నేతన్నకు నెలకు అదనంగా రూ.3 వేల ఆదాయం రానున్నదన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ గ్రామీణ ఉపాధిలో వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే ఎక్కువ మంది ఆధారపడి ఉన్నారని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు చేదోడుగా ఉండేందుకై ఎగ్జిబిషన్లు, విక్రయదారులు, కొనుగోలు దారుల సమావేశాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందని చెప్పుకొచ్చారు. ఎన్నికల సమయంలో చేనేతలకు 50 సంవత్సరాలకే ఫించను ఇస్తామని ఇచ్చిన హామీని నిలపెట్టుకోవడం జరిగిందన్నారు. ప్రతి నెలా రూ.4 వేల చొప్పున దాదాపు 92,274 మంది నేతన్నలకు ఫించను అందజేస్తున్నట్లు తెలిపారు. నేతన్న మగ్గాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. గృహ నిర్మాణ పథకం కింద కూడా నేతన్నలకు రూ.50 వేలు అదనంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేత, హస్తకళల నూతన డిజైన్ల పోటీలు - మంత్రి సవిత రాష్ట్రంలోని నేత కార్మికులతో పాటు హస్తకళాకారుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో నూతన డిజైన్ల కోసం పోటీలు నిర్వహించబోతున్నామని మంత్రి తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఆప్కో, లేపాక్షి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 17 నుంచి 30 రోజుల పాటు నూతన డిజైన్లను కళాకారుల నుంచి స్వీకరిస్తున్నామన్నారు. పలు కేటగిరీల్లో ఉత్తమ డిజైన్లను ఎంపిక చేసి విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నామని మంత్రి లిపారు. ఆప్కో, లేపాక్షి పనితీరు మరింత మెరుగుపరచడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నం తో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఆప్కో, లేపాక్షిలో జవాబుదారీతనం, పారదర్శకతను బలోపేతం చేయడం, లాభాల బాటలో పయనించేలా చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం అన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో టాలీవుడ్ పెద్దల సమావేశం వాయిదా

**- జూన్ 15న సాయంత్రం 4 గంటలకు భేటీ అంటూ ఇటీవల వార్తలు**
**- ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరగాల్సిన మీటింగ్**
**- షూటింగ్‌ల వల్ల పలువురు ప్రముఖులు అందుబాటులో లేకపోవడమే కారణం**
**- ముఖ్యమైన పెద్దలు కూడా హాజరుకాలేని పరిస్థితి**

**అమరావతి - సూర్యవాస్తవం, జూన్ 14**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు జరప తలపెట్టిన సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం, ఈ భేటీ జూన్ 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరగాల్సి ఉంది. అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పలువురు సినీ ప్రముఖులు ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో షూటింగ్‌లతో బిజీగా ఉన్నారు. దీనికి తోడు, ఈ సమావేశానికి హాజరుకావాల్సిన మరికొంతమంది ముఖ్యమైన పెద్దలు కూడా అందుబాటులో లేకపోవడంతో, ప్రస్తుతానికి ఈ భేటీని వాయిదా వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ప్రముఖ దర్శకులు బోయపాటి శ్రీను, త్రివిక్రమ్ శ్రీనివాస్, రాజమౌళి, నాగ్ అశ్విన్... నిర్మాతలు అశ్వినీదత్, దిల్ రాజు, అల్లు అరవింద్, డీవీవీ దానయ్య, కేవీ రామారావు... నటులు నందమూరి బాలకృష్ణ, వెంకటేశ్ దగ్గుబాటి, మంచు మనోజ్, సుమన్, ఆర్. నారాయణమూర్తి, నాని తదితరులు పాల్గొంటారని వార్తలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సినీ ప్రముఖులకు ఫోన్ చేసి ఈ సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిసింది. ఈ భేటీకి సుమారు 35 నుంచి 40 మంది దర్శకులు, నిర్మాతలు, నటీనటులు హాజరయ్యే అవకాశం ఉంది.

# సైప్రస్ కు మోడీ.. టార్గెట్ టర్కీ...

**న్యూఢిల్లీ - సూర్యవాస్తవం, జూన్ 14**

జీ7 సదస్సుల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ కెనడాకు వెళ్లనున్నారు. మొదట ఈ సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందలేదు. అయితే జీ7 సభ్యదేశాల ఒత్తిడితో కెనడా తప్పనిసరి పరిస్థితిలో భారత్‌ను ఆహ్వానించింది. దీంతో మోదీ కెనడా వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఓ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. అతి చిన్న దేశంలోనూ పర్యటన షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2025 జూన్ 15-16న సైప్రస్‌ను సందర్శించారు, ఇది 23 సంవత్సరాల తర్వాత భారత ప్రధాని చేసిన తొలి పర్యటన. జీ7 శిఖరాగ్ర సమావేశానికి (జూన్ 15-17కెనడా) వెళ్లే మార్గంలో సైప్రస్‌లోనూ పర్యటించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ సైప్రస్‌తో మనకు పెద్దగా వ్యాపార, సైనిక సంబంధాలు కూడా లేవు. కానీ, మోదీ ఈ దేశంలో పర్యటన ఖరారు చేసుకున్నారు. దీని వెనుక పెద్ద వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది. టర్కీ-పాకిస్తాన్ ఐక్యతకు చెక్ పెట్టడానికి, టర్కీ శత్రు దేశాలైన సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో మైత్రిని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్యగా నిలిచింది. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా టర్కీ పాకిస్తాన్‌కు సైనిక, రాజకీయ మద్దతు ఇచ్చింది. టర్కీ డ్రోన్ టెక్నాలజీ, ఆయుధ సరఫరాల ద్వారా పాకిస్తాన్‌తో సహకారాన్ని బలపరిచింది. ఈ నేపథ్యంలో, శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా.. టర్కీతో విభేదాలున్న సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో భారత్ సంబంధాలు రాజకీయంగా కీలకమయ్యాయి. మోదీ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌తో చర్చలు జరుపుతారు. ఆర్థిక, వాణిజ్య, ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఎఓఇఅ)పై దృష్టి సారించారు. ఎఓఇఅ, టర్కీ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా, సైప్రస్, గ్రీస్ ద్వారా యూరప్‌ను మధ్యప్రాచ్యంతో కలుపుతుంది. సైప్రస్ ఈ కారిడార్‌లో భాగస్వామ్యం టర్కీకి ఆర్థిక, రాజకీయ ఒత్తిడిని సృష్టిస్తుంది.

**టర్కీ శత్రు దేశాలతో మైత్రి..**

టర్కీకి సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో దీర్ఘకాల విభేదాలున్నాయి. 1974 టర్కీ ఆక్రమణ తర్వాత ఉత్తర సైప్రస్ వివాదం కొనసాగుతోంది. భారత్ సైప్రస్ ఐక్యత, సార్వభౌమత్వానికి యూఎన్ తీర్మానాల ద్వారా మద్దతిస్తుంది. తూర్పు మధ్యధరా సముద్ర సరిహద్దులపై టర్కీ-గ్రీస్ వివాదాలున్నాయి. భారత్-గ్రీస్ సైనిక, ఆర్థిక సహకారం బలపడుతోంది,

# రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడా..?

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. తన పర్యటనకుసంఘీభావంగా దాదాపు 40 వేల మంది రైతులు, ప్రజలు తరలి వచ్చారని జగన్ తెలిపారు. అయితే, తాము వెళ్తున్న మార్గంలో 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారితో రాళ్లు విసిరి గలాటా చేయించారని ఆరోపించారు. ఈ రాళ్ల దాడి వెనకున్న పన్నాగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు, రైతులు అత్యంత సంయమనంతో వ్యవహరించారని చెప్పారు. రాళ్ల దెబ్బలు తిన్న వైసీపీ కార్యకర్తలు, రైతులపైనే పోలీసు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా, తిరిగి వారిపైనే ఎదురు కేసులు పెట్టడం మీకు మాత్రమే చెల్లుతుంది అంటూ జగన్ ట్వీట్ చేశారు. ఆ నలభై మంది టీడీపీ కార్యకర్తలపై అక్కడున్న 40 వేల మంది ప్రజలు తిరగబడి ఉంటే ఏం జరిగి ఉండేదని జగన్ ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలి, అన్యాయాన్ని సరిదిద్దాలని కోరితే తానేదో విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆరోపించడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.

# గంటలో శ్రీవారి దర్శనానికి ప్లాన్



**తిరుమల - సూర్యవాస్తవం, జూన్ 14**

తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ప్రతి ఏడాది స్వామి వారిని దర్శించుకునే వారు ఉంటారు. రోజుకు గరిష్టంగా లక్షలాదిమంది.. కనిష్టంగా వేలాది మంది భక్తులు తిరుమల వస్తుంటారు. వారికి దర్శనాలు కల్పించడంతోపాటు నియంత్రించడం టిటిడి కి కష్ట సాధ్యం అవుతుంది. పటిష్టమైన చర్యలు చేపడుతున్న ఎక్కడో చోట లోపాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో క్యూ లైన్లోకి మించి బయటకు భక్తులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అయితే గంటలపాటు కాంప్లెక్స్ లలో భక్తులు వేచి ఉండాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో వినూత్న ఆలోచన చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. భక్తులు క్యూ లైన్ లలో ఉండగానే స్వామి వారి దర్శన భాగ్యం కల్పించేందుకు నిర్ణయించింది. సాధారణంగా తిరుమల వెళ్లే భక్తులకు స్వామివారి దర్శనానికి కొన్నిసార్లు 12 గంటల సమయం పడుతుంది. ఆ సమయంలో భక్తుల బాధలు వర్ణనాతీతం. టీటీడీ( పరంగా మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు అందిస్తోంది. కానీ క్యూలైన్లలో భక్తులు ఉన్నప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అటువంటి సమయంలో స్వామివారి దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇటీవల చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు కార్యాచరణను వేగవంతం చేశారు. ముఖ్యంగా భక్తులు వేచి ఉండే కంపార్ట్మెంట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారుఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు ద్వారా తిరుమల వచ్చే భక్తుల రద్దీ ని అంచనా వేయనున్నారు టీటీడీ అధికారులు.

తద్వారా భక్తులకు దర్శన సమయాన్ని నిర్దిష్టంగా ఇవ్వనున్నారు. ప్రస్తుతం గంటకు ఎంతమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారనే సమాచారం టిటిడి వద్ద లేదు. ఆ వివరాలు అందుబాటులోకి వస్తే దళారులు, కొందరు ఉద్యోగుల సహకారంతో ఇష్టారాజ్యంగా క్యూ లైన్లోకి వచ్చే సంస్కృతికి బ్రేక్ పడుతుంది. జియో సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫేషియల్ రికగ్నిషన్ ను ఉపయోగించి భక్తుల మొక్క చిత్రాలు నమోదు చేస్తుంది. తద్వారా గంటల వ్యవధిలోనే తిరుమల శ్రీవారి దర్శనం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇదే విషయాన్ని తాజాగా వెల్లడించారు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు.

## సంపాదకీయం

### భారత్ రుద్రాస్త్ర, భార్గవాస్త్ర...



భారత సాయుధ దళాలు ఆధునిక యుద్ధ సాంకేతికతలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. ఇప్పటికే దేశీయంగా అనేక ఆయుధాలు రూపొందించుకోవడంతోపాటు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. ఇదే సమయంలో విదేశాల నుంచి కూడా అవసరమైన ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ రూపొందించిన 'రుద్రాస్త్ర' అనే హైబ్రిడ్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ మానవ రహిత విమానం (యూఏవీ) 2025, జూన్ 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించబడింది. దీనిని నిఘా, రక్షణ, గుర్తింపు, కచ్చితమైన దాడుల కోసం రూపొందించారు. ఇది భారత సైన్యానికి బహుముఖ సామర్థ్యాలను అందిస్తుంది. తాజా పరీక్ష భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది.రుద్రాస్త్ర యూఏవీ 50 కిలోమీటర్ల మిషన్ పరిధిలో అద్భుతమైన పనితీరును ప్రదర్శించింది, రియల్ టైమ్ వీడియో ఫీడ్‌ను స్థిరంగా అందించడంతోపాటు, సురక్షితంగా లాంచింగ్ పాయింట్‌కు తిరిగి వచ్చింది. లక్ష్యంపై చక్కర్లు కొట్టే సామర్థ్యంతో దీని మొత్తం పరిధి 170 కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఇది 1.5 గంటల పాటు నిరంతరాయంగా గగనతలంలో ప్రయాణించగలదు. పరీక్ష సమయంలో, ఈ యూఏవీ యాంటీ?పర్సనల్ వార్‌హెడ్‌ను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంపై ప్రయోగించి, భూమికి సమీపంలో ఉన్నప్పుడు పేల్చడంలో విజయవంతమైంది. ఈ పరీక్ష భారత సైన్యం నిర్దేశించిన కఠిన ప్రమాణాలను అందుకుంది, ఈ రుద్రాస్త్ర బహుముఖ సామర్థ్యాలను నిరూపించింది.భారత్ డ్రోన్ యుద్ధ సాంకేతికతలో వేగంగా ముందుకు సాగుతోంది. రుద్రాస్త్రతోపాటు, సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ మరో కీలకమైన ఆయుధం, 'భార్గవాస్త్ర' అనే యాంటీ?డ్రోన్ వ్యవస్థను 2025 మే 13న ఒడిశాలోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించింది. ఈ వ్యవస్థ డ్రోన్ సమూహాలను నిష్క్రియం చేయడానికి మైక్రో?రాకెట్లను ఉపయోగిస్తుంది, ఇది ఆధునిక యుద్ధంలో డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడానికి కీలకమైన సాధనంగా నిలుస్తుంది.డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ రుస్తుం సిరీస్ డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది, ఇవి మధ్యస్థ ఎత్తులో ఎక్కువ సమయం ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించబడ్డాయి. ఇవి నిఘా, యుద్ధం సామగ్రి సరఫరా కోసం ఉపయోగపడతాయి. అదానీ డిఫెన్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ప్రముఖ సంస్థలు కూడా అధునాతన డ్రోన్ తయారీలో పాల్గొంటున్నాయి. ఇవి సరిహద్దు రక్షణ, యుద్ధ వ్యూహాలను మెరుగుపరుస్తున్నాయి.2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో, ఇజ్రాయెల్ సాంకేతికత సహాయంతో బెంగళూరులోని ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ రూపొందించిన స్కైస్ట్రైకర్ కామికేజ్ (ఆత్మాహుతి) డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా ఉపయోగించింది. ఈ డ్రోన్లు పాకిస్థాన్ రాడార్లు, కాన్వాయ్‌లు, ఇతర కీలక స్థావరాలను నాశనం చేశాయి. ఇది భారత్ డ్రోన్ యుద్ధ సామర్థ్యాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేసింది.రుద్రాస్త్ర యూఏవీ, భార్గవాస్త్ర వంటి స్వదేశీ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో సాంకేతిక స్వావలంబన దిశగా దూసుకెళుతున్నాయి. ఈ వ్యవస్థలు ఆధునిక యుద్ధంలో కీలకమైన డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడంతోపాటు, నిఘా, కచ్చితమైన దాడులు, సరిహద్దు రక్షణలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఆఖీఆ, ౹ాఆంఒ ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ, భారత సైన్యాన్ని అత్యాధునిక యుద్ధ సామర్థ్యాలతో బలోపేతం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో స్కైస్ట్రైకర్ డ్రోన్ల వినియోగం భారత్?ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం ఫలితాలను ప్రదర్శించింది. ఈ విజయాలు భారత్‌ను డ్రోన్ యుద్ధ సాంకేతికతలో ప్రపంచ నాయకుడిగా నిలపడానికి దోహదపడతాయి. అయితే, ఈ సాంకేతికతలను మరింత సమర్థవంతంగా, స్థిరమైన ఉత్పత్తి, శిక్షణతో అమలు చేయడం భవిష్యత్తులో కీలకం.రుద్రాస్త్ర, భార్గవాస్త్ర, స్కైస్ట్రైకర్ వంటి డ్రోన్ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత, అంతర్జాతీయ సహకార సమ్మేళనాన్ని సూచిస్తున్నాయి. ఈ పురోగతులు భారత సాయుధ దళాలను ఆధునిక యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేస్తూ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తున్నాయి.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం...

విజయవాడ – సూర్యవాస్తవం, జూన్ 14

అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్‌న్యూస్. దశాబ్దాల పోరాటానికి త్వరలో న్యాయం జరగనుంది. కడుపుకట్టుకుని కూడబెట్టుకున్న సొమ్ము.. మళ్లీ తిరిగి ఇచ్చేందుకు సర్వం సిద్ధమవుతోంది. మరి బాధితులకు ఏవిధంగా నష్టపోయిన సొమ్ము అందించనున్నారు. దీనికి ప్రభుత్వ కార్యాచరణ ఎలా ఉండబోతోంది..? తెలుసుకుందాం.ఆస్తుల పునరుద్ధరణ ద్వారా ఊరట లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) ద్వారా జప్తు చేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను బాధితులకు పంపిణీ చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ. 6 వేల కోట్లుగా అంచనా వేయడం జరిగింది. ఈడీ హైదరాబాద్ జోన్ కార్యాలయం, అగ్రి గోల్డ్ గ్రూప్ కంపెనీలు నడిపిన పొంజీ స్కీమ్ బాధితులకు సంబంధించి రూ.611 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించడం ద్వారా మరోసారి విజయాన్ని సాధించింది. అటాచ్‌మెంట్ సమయంలో వీటి విలువ రూ.611 కోట్లు కాగా, ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1,000 కోట్లు మించిపోయే అవకాశం ఉందిఈ ఏడాది మే నెలలో ఈడీ, మనీలాండరింగ్ నిరోధక చట్టం (ఖఓఒం) 2002 సెక్షన్ 8(8) కింద ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో అటాచ్ చేసిన స్థిర, చర ఆస్తులను ఆంధ్రప్రదేశ్ సీఐడీకి విడుదల చేసి, ఆస్తులను బాధితులకు తిరిగి అప్పగించే నిమిత్తంగా ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం (ంఖఖఆఈఇ), 1999 ప్రకారం పునరుద్ధరించాలని కోరింది. హైదరాబాద్‌లోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు, ఈ పిటిషన్‌ను జూన్ 10, 2025న ఆమోదించింది. ఈ మేరకు 397 స్థిర ఆస్తుల పునరుద్ధరణకు మార్గం సుగమం అయింది. వీటిలో 380 ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌లో, 13 తెలంగాణలో, 4 కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. వీటిలో వ్యవసాయ భూములు, నివాస, వాణిజ్య స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయిఅగ్రి గోల్డ్ గ్రూప్‌పై ఈడీ 2018లో దర్యాప్తు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్ ఓ నికోబార్ లలో నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ కేసు విచారణకు వచ్చింది. అగ్రి గోల్డ్ కంపెనీలు అసలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పొంజీ స్కీమ్ నడిపి దాదాపు 19 లక్షల ఖాతాదారుల నుంచి రూ.6,380 కోట్లను వసూలు చేశాయి. 130కి పైగా కంపెనీలను ఏర్పాటు చేసి ప్రజల వద్ద నుండి 'ప్లాట్ అడ్వాన్స్' పేరుతో డిపాజిట్లు వసూలు చేశారు. వేలాది కమిషన్ ఏజెంట్లను నియమించి ప్రజలను మోసం చేశారు. ఈ డబ్బులను వారు ప్రజలకు తెలియకుండా పవర్, డైరీ, ఆరోగ్యం, ఎంటర్‌టైన్‌మెంట్, వ్యవసాయ రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. ఒప్పందం ప్రకారం డబ్బును వెనక్కి ఇవ్వడంలో విఫలమయ్యారు.ఆస్తుల విలువ: ఈడీ దర్యాప్తులో భాగంగా దాదాపు రూ.4141.2 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను అటాచ్ చేసింది. 2020 డిసెంబర్‌లో అవ్వ వెంకట రామారావు, అవ్వ శేషు నారాయణ రావు, అవ్వ హేమ సుందర వర ప్రసాద్‌ను అరెస్ట్ చేసింది. 2021 ఫిబ్రవరిలో 14 మందిపై ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. 2024 మార్చిలో మరో 22 మందిపై సప్లిమెంటరీ చార్జ్‌షీట్ సమర్పించారు.అంతకు ముందు 2025 ఫిబ్రవరిలో రూ.3,339 కోట్ల విలువైన ఆస్తులను బాధితులకు పునరుద్ధరించారు (ప్రస్తుత విలువ రూ.6,000 కోట్లు). తాజా పునరుద్ధరణతో కలిపి మొత్తం రూ.3,950 కోట్ల విలువైన ఆస్తులు బాధితులకు తిరిగి అప్పగించబడ్డాయి. వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.7,000 కోట్లకు పైగా ఉంటుంది. ఈ చర్యలు నేరస్థుల వద్ద నుండి దోచుకున్న ఆస్తులను తిరిగి న్యాయబద్ధంగా బాధితులకు అప్పగించడంలో ఈడీ తీసుకున్న ప్రాముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.అగ్రిగోల్డ్ స్కామ్ బాధితులకు ఈడీ ఆస్తుల పంపిణీ ప్రక్రియ ఒక చారిత్రక అడుగుగా నిలుస్తుంది. రూ. 7,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను బాధితులకు అందించే ఈ ప్రక్రియ, దశాబ్దకాలంగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి ఒక సానుకూల మలుపు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, ఈడీ, సీఐడీ సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని ఆశిస్తున్నారు. ఈ కృషి, ఆర్థిక మోసాల బాధితులకు న్యాయం అందించడంలో ఒక ఆదర్శంగా నిలుస్తుంది, అలాగే భవిష్యత్తులో ఇలాంటి స్కామ్‌లను నిరోధించేందుకు కఠిన చర్యల అవసరాన్ని గుర్తు చేస్తుంది.



# ఏపీలో నాలా చట్టం రద్దు..

విజయవాడ – సూర్యవాస్తవం, జూన్ 14

ఏపీ రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు రానున్నాయి. నాలా చట్టం రద్దుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దీనిపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ? లోతుగా అన్ని విషయాలను పరిశీలిస్తోంది. తుది ముసాయిదా ప్రతిపాదనల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ ఆదేశాలు ఇచ్చిందివ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించిన ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్(కన్వర్షన్ ఆఫ్ నాన్ అగ్రికల్చరల్ పర్పసెస్) యాక్ట్ 2006ను రద్దు చేసేందుకు విధివిధానాలు రూపొందించనున్నారు. ఈ మేరకు మంత్రివర్గం ఉపసంఘం ఆదేశాలను జారీచేసింది. వ్యవసాయేతర అవసరాలకు భూములను మార్పిడి చేసుకునేందుకు నాలా చట్టం వల్ల ఇప్పటి వరకు అనేక రకాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే దీన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు? మూడో కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ప్రకటించారు. ఇదే విషయంతో పాటు రెవెన్యూ శాఖలో తీసుకురావాల్సిన అంశాలపై కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటైంది.ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో మూడోసారి భేటీ అయ్యింది. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఈ భేటి జరిగింది. ఇందులో అనగాని సత్యప్రసాద్ తోపాటు మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు నాలాను రద్దు చేసి ప్రజలు ట్యాక్స్ కట్టేస్తే ఆటోమేటిక్‌గా భూ మార్పిడి జరిగేలా ముసాయిదా విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రులు చెప్పారు. భూ మార్పిడి అత్యంత సులభంగా జరగాలని అభిప్రాయపడ్డారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఎలా చేయాలనే దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి సమావేశంలో అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై చర్చించనున్నారు. నిర్ణయించిన విధివిధానాలను మంత్రివర్గం ముందు పెడతామని మంత్రులు చెప్పారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ?. ప్రజలకు ఇబ్బందిగా మారిన నాలాను రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతేకాక నాలా ట్యాక్స్ కూడా ఎక్కువగా ఉందని పలు సంఘాల నుండి అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఆ ట్యాక్స్‌ను కూడా ఎంతమేరకు తగ్గించవచ్చో ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వీలైతే ఈ ప్రతిపాదనలను జూన్ 19న జరిగే మంత్రివర్గ సమావేశంలో పెట్టి చర్చిస్తామని తెలిపారు.



# కరెంట్‌కు తల్లికి వందనానికి లింక్...

విజయవాడ – సూర్యవాస్తవం, జూన్ 14

రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం నిధులు జమ చేసినట్లు చెబుతోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మందికి పైగా అర్హులు ఉన్నట్లు తేల్చింది. కానీ రకరకాల కారణాలు చెబుతూ ఈ జాబితాలో చాలా వరకు కోత పడింది. ముఖ్యంగా 300 యూనిట్ల విద్యుత్ వినియోగం అంటూ అనర్హుల జాబితాలో చేర్చడం ఆందోళన కలిగిస్తోంది. అసలు విద్యుత్ బిల్లుల విషయంలో అస్పష్టత కొనసాగుతోంది. ట్రూ ఆఫ్ చార్జీలు పెరిగాయని ఒకసారి.. తగ్గాయని మరోసారి.. ఇలా విద్యుత్ చార్జీల్లో వ్యత్యాసం కనిపించింది. అయితే ఇది సర్వసాధారణ చర్యగా భావించిన సామాన్యులకు ఇప్పుడు తల్లికి వందనం రూపంలో షాక్ తగిలింది. మీరు నిర్దేశించిన యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించారంటూ తల్లికి వందనం పథకంలో కోత విధించారు. దీనికి తోడు సాంకేతిక సమస్యలు, ఆధార్ సీడింగ్ అంటూ కొత్త మెలికలు పెట్టి భారీగా కోత విధిస్తున్నారు.

దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. విద్యుత్ వినియోగం300 యూనిట్ల కంటే అధికంగా ఉంటే జగన్ సర్కార్ అమ్మ ఒడి పథకాన్ని నిలిపివేసింది. అప్పట్లో దీనిని తప్పు పట్టింది కూటమి. కరెంటు ఎక్కువ కాలిస్తే పథకం నిలిపివేస్తారా అని నిలదీసింది. ఇప్పుడు అదే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చింది. కరెంటు ఎక్కువగా వినియోగిస్తే పథకం ఇవ్వలేమంటూ తేల్చేసింది. అయితే సామాన్యుడికి విద్యుత్ చార్జీల విషయంలో అవగాహన లేదు. అందుకే విద్యుత్ వినియోగం విషయంలో ఏం చేయాలో పాలు పోక.. వచ్చిన బిల్లును కట్టుకుంటూ ముందుకు సాగాడు. కానీ తీరా ఇప్పుడు పథకం అమలు విషయానికి వచ్చేసరికి షాక్ తగిలేలా కూటమి సర్కార్ విద్యార్థుల తల్లిదండ్రులకు చేదు వార్త వినిపించింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా తల్లుల ఖాతాలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ తల్లికి వందనం నిధులు జమ చేశారు. కానీ సాయంత్రానికే ప్రతి గ్రామంలో పదిమందికి తగ్గకుండా విద్యుత్ వినియోగం అధికం చేశారన్న నెపంతో పథకాన్ని నిలిపివేశారు. దీంతో కొందరు తల్లులకే వందనమా అంటూ సెటైర్లు పడుతున్నాయి. ఒక ఏడాది సాయాన్ని ఇప్పటికే హరించారు. ఇప్పుడు వస్తుందనుకున్న తల్లికి వందనం పథకం రాకపోయేసరికి సగటు లబ్ధిదారుడు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నాడు. కనీసం ముందస్తుగా మార్గదర్శకాలు, వినతులు స్వీకరించి ఉంటే ఇటువంటి సాంకేతిక సమస్యలు అధిగమించే అవకాశం ఉంది. కానీ ఉన్నపలంగా మార్గదర్శకాలు జారీ చేయకుండా.. కొందరి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసి.. 300 యూనిట్ల విద్యుత్ వినియోగం పేరిట కొత్త విధించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరికొందరు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించకుండానే పథకానికి అనర్హుల పేరిట తేల్చేయడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఇదేమని సచివాలయాలకు వెళ్తుంటే.. విద్యుత్ కార్యాలయాలకు పంపిస్తున్నారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళితే అంతా సరిగ్గా ఉంది సచివాలయాలకు వెళ్ళండి అంటూ సూచిస్తున్నారు. దీంతో సామాన్యుడికి అర్థం కావడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభు త్వంలో లేని నిబంధనలు.. ఇప్పుడు తెరపైకి రావడం పై ఎక్కువ మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు ఎక్కువ కాల్చితే.. పథకాలు నిలిపి వేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ చార్జీలు పెరిగాయి. కుటుంబ అవసరాల కోసం విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతమంది అధికంగా విద్యుత్ వినియోగించారు. సాధారణంగా వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువ. దీంతో ఏడాది ప్రాతిపదికగా తీసుకొని విద్యుత్ వినియోగాన్ని లెక్కించలేదు. 250– 300 యూనిట్ల మధ్య విద్యుత్ వినియోగించిన వారిని సైతం అనర్హులుగా తేల్చడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనికి తోడు సాంకేతిక సమస్యలు ఉండనే ఉన్నాయి. తల్లికి వందనం అనేది విద్యా శాఖ తో పాటు సచివాలయాలు, ఆపై విద్యుత్ శాఖ, రవాణా శాఖ వంటి అంశాలతో ముడిపడి ఉంది. కానీ ఇవేవీ పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఉన్నఫలంగా తల్లికి వందనం పేరిట లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమ చేసింది. వాస్తవానికి 69 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే.. 45 లక్షల మందికి ఇవ్వడం ఏమిటనేది ఇప్పుడు ప్రశ్న. ఏడాదిగా పథకం అమలు చేయలేదు. తీరా ఇప్పుడు ఇచ్చారంటే నిబంధనల పేరిట కొర్రీలు పెడుతుండడం మాత్రం నిజంగా ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడమే. మరి వాటిని సరిచేసి లబ్ధిదారులకు అందిస్తారో.. లేకుంటే ప్రజాగ్రహానికి గురి అవుతారో తేల్చుకోవాల్సింది ప్రభుత్వమే.




## జగన్ వర్సెస్ లోకేశ్

### - సోషల్ మీడియా వార్

విజయవాడ – సూర్యవాస్తవం, జూన్ 14



సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేయడం పట్ల ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓ ట్వీట్ చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణకు సంబంధించిన వీడియోలను ఆయన పోస్ట్ చేశారు. గతంలో చంద్రబాబు, బాలకృష్ణ చేసిన కామెంట్లు ఇందులో ఉన్నాయి. అలాగే, నారా లోకేశ్ పలువురు అమ్మాయిలతో దిగిన ఫొటోలను కూడా వీడియో రూపంలో జగన్ పోస్ట్ చేశారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పాలన కొనసాగిందని, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా మోసపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఏపీలో రెడ్ బుక్ పాలన నడుస్తోందని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుని అన్యాయంగా కేసులో ఇరికించి, అరెస్టు చేశారని తెలిపారు. కూటమి పాలనలో 188 లైంగిక దాడులు జరిగాయని అన్నారు.జగన్ ట్వీట్‌పై నారా లోకేశ్ దీటుగా స్పందించారు. జగన్ సహా వైసీపీ నేతలు చేసిన కామెంట్లకు సంబంధించిన వీడియోలను ఆయన పోస్ట్ చేశారు. మహిళలంటే ఎందుకింత ద్వేషమని ప్రశ్నించారు. తనకు కాలేజీ లైఫ్ ఉందని, జగన్‌కు జైలు జీవితం ఉందని తెలిపారు. తనకు క్లాస్‌మేట్స్ ఉన్నారని, జగన్‌కు జైల్‌మేట్స్ ఉన్నారని అన్నారు.మహిళలను గౌరవించడాన్ని తాను చిన్నప్పటినుంచు నేర్చుకున్నానని, జగన్ మాత్రం కన్న తల్లితో పాటు సొంత చెల్లిని ఇంటి నుంచి గెంటేశారని, న్యాయస్థానానికి లాగారని అన్నారు. వారిపై మీడియాతో పాటు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఏపీలో జగన్ ఐదేళ్ల పాలన ఒక చీకటి అధ్యాయమని విమర్శించారు.

### మానసిక ఉల్లాసం

# యోగాతోనే సాధ్యం

**- 11వ ఏపీఎస్పీ బెటాలియన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర**



**సిద్దవటం –సూర్య వాస్తవం, జూన్ 14:** మానసిక ఉల్లాసం యోగాతోనే సాధ్యమవుతుందని 11వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ కె. ఆనంద రెడ్డి తెలిపారు. మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో శనివారం యోగాంధ్ర 2025 కార్యక్రమం ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. కమాండెంట్ కె. ఆనంద రెడ్డి ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ఇషా ఫౌండేషన్ సభ్యులు బెటాలియన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు నెల రోజుల పాటు జరిగే యోగా వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం ఇషా ఫౌండేషన్ సంస్థ సభ్యులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యాక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బి. వెంకట శివుడు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐ లు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# విమానం కూలిపోవడం బాధాకరం

**- విమాన ప్రమాదం తీవ్ర ఆవేదన కలిగించింది**
**- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**
**- అన్నమయ్య డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్**



**రాయచోటి–సూర్యవాస్తవం, జూన్14:** అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోయి పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ చీఫ్ సెక్రటరీ అమీర్ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... గుజరాత్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన వారికి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉండాలని కోరారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన మీడియా ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ... అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం అత్యంత విషాదకరమైనదని, తీవ్రమైన దిగ్భ్రాంతికి లోనయ్యానని చెప్పారు.

# స్వచ్ఛ సేవా - స్వచ్ఛ హిందూపురం




**హిందూపురం టౌన్–సూర్య వాస్తవం,జూన్ 14:** హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణంలో త్యాగరాజ్ నగర్ లో తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సేవా - స్వచ్ఛ హిందూపురం కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ చైర్ పర్సన్ డి ఈ రమేష్ కుమార్ మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ తాగరాజ్ నగర్‌లో ఉన్న ప్రజలు తమ ఇంటిలో ఉన్న చెత్తను కాలువలలో వేయడం వలన కాలువ నీరు అక్కడిక్కడే నిలిచిపోయి ప్రజలు అనారోగ్య సమస్యలు వస్తాయని చెత్తను చెత్త బండికి ఇవ్వాలని వీధిలో ఉన్న చెత్తను పరిశుభ్రపరిచి చెత్త ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకి తరలించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువత పారిశుధ్య కార్మికులు , వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున



**హిందూపురం టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 14 :** హిందూపురం మున్సిపల్ నూతన కమిషనర్‌గా మల్లికార్జున శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పక్షాలతోనూ ఉద్యోగులతో సమన్వయం చేసుకొని హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా గ్రాండ్ సక్సెస్

**- పోలీస్ పరేడ్ మైదానంలో 2300మందితో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్**
**- దివ్యాంగుల ఆరోగ్యానికి ఇది చక్కటి కార్యక్రమమన్న జిల్లా కలెక్టర్**
**- ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసేలా సీఎం చంద్రబాబు చేస్తున్నారు : ఎమ్మెల్యే దగ్గుపాటి**







**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 14:** అనంతపురం నగరంలో దివ్యాంగులతో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయింది. యోగాంధ్ర–2025లో భాగంగా ప్రతిరోజు పలు రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురంలో దివ్యాంగులతో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దివ్యాంగులు, పింఛన్ దారులు, వృద్ధులు ఏ విధంగా యోగా చేయాలన్నది ఇక్కడ ఆసనాలు వేసి చూపించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ కూడా ఈ ఆసనాలు వేసి దివ్యాంగులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కార్యక్రమాన్ని అనంతపురంలో ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వికలాంగులు, పింఛన్ దారులు మొత్తం 2300 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చిన టీచర్లు, వెల్ఫేర్ అధికారులు అందరూ పెద్ద ఎత్తున ఇక్కడ పాల్గొని విజయవంతం చేశారన్నారు. దివ్యాంగులు ఎవరెవరు ఎలాంటి ఆసనాలు చేయగలుగుతారో వాటిపై సూచనలు ఇస్తూ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈనెల 21న వరల్డ్ రికార్డ్‌లో భాగంగా యోగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముందస్తుగానే సన్నాహాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి పాల్గొన్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలు మేరకు పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21న వైజాగ్‌లో మూడు లక్షల మందితో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసే విధంగా ఆ కార్యక్రమం ఉండబోతుందని అనంతపురంలో కూడా ఆర్డిటి క్రీడా మైదానంలో వేలాది మందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనంతపురంలో దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, డిఆర్ఓ ఏ.మాలోల, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి వినోద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆర్డీఓ కేశవనాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయుష్ డాక్టర్స్ డా.రామ్ కుమార్, డా.లాల్యానాయక్, యోగా గురువులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో తొలిసారిగా

# మహిళా సంఘాల సభ్యులకు ర్యాపిడో ఈ-బైక్‌లు

**- మెప్మా ఆధ్వర్యంలో బైక్‌లను అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఇతర అధికారులు**
**- మహిళలు స్వయం ఉపాధి సాధించే దిశగా ఇది వినూత్న కార్యక్రమం : ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- ప్రతి నెల రూ.15 నుంచి 18వేలు మహిళకు సంపాదించుకునే అవకాశం**
**- మహిళలకు ఇది ఒక మంచి అవకాశమన్న జిల్లా కలెక్టర్**







**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 14:** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళలు స్వయం ఉపాధి సాధించే విధంగా ప్రభుత్వం ర్యాపిడో ఈ–బైక్ లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. మహిళా సంఘాల సభ్యులకు మెప్మా ఆధ్వర్యంలో రాపిడో ఈ–బైక్ లు పంపిణీని ఇవాళ అనంతపురం నగరంలో ప్రారంభించారు. నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఈ బైక్ లను ప్రారంభించారు. అనంతపురం నగరానికి మొత్తం 250 రాపిడో ఈ బైక్ లు మంజూరు కాగా.. ఇందులో మొదటి విడతగా 20 బైక్ లను మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా రాపిడో ఈ బైక్ లను అందజేసినట్లు తెలిపారు. ఒక్కో బైక్ ఖరీదు లక్ష 23వేలు కాగా.. డౌన్ పేమెంట్ కింద 18వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నెలకు 15 నుంచి 18 వేల వరకు ఉపాధి పొందే విధంగా దీనిని రూపొందించారన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా... అందరికీ 15వేలు రూపాయలు ఆర్థిక సాయం చేసిందన్నారు. ప్రతి ఒక్కరు దీనిపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో ఇంట్లో ఇంతమంది పిల్లలు ఉన్నా అందరికీ అమ్మబడి ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ 15వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ కు అర్బన్ నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

మరోవైపు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నగరాల్లో మహిళా రైడర్ల సేవల్ని ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ర్యాపిడో సంస్థతో ఒప్పందం చేసుకుందన్నారు. స్వయం సహాయక సంఘంలోని సభ్యులకు ఈ ర్యాపిడీ–ఈ బైక్ లు అందజేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు వారి కుటుంబ సభ్యుల స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడానికి స్వయం సహాయక సంఘ సభ్యులకు సాధికారత కల్పించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బ్యాంక్ నుండి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే నెలవారి ఈఎంఐలు ఉంటాయన్నారు. మూడు నెలల కాలానికి నెలకి వేయి రూపాయిల ప్రకారం రాపిడో ప్లాట్ ఫామ్ ఛార్జీలను మాఫీ చేస్తారన్నారు. ఇందులోఎలక్ట్రిక్ ద్విచక్ర చక్రాల వాహనల వలన నామమాత్రపు నిర్వహణ ఛార్జీలు, ఇంధన ఖర్చు ఉండదని.. అలాగే పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. దీనిని స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, డిఆర్డిఏ పిడి శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బిడ్డలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

**- బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన కుటుంబీకులు**





**మదనపల్లి –సూర్య వాస్తవం, జూన్ 14 :** భార్య పిల్లలను భర్త సక్రమంగా చూసు కోవడం లేదన్న బాధతో ఓ ఇల్లాలు జీవితంపై విరక్తిచెందింది. టమోటా చెట్లకు కొట్టడానికి తెచ్చి ఇంట్లో ఉంచిన పురుగుమందు బిడ్డలకు జూస్లో ఇచ్చి ఆపై ఆమె కూడా తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. శనివారం సాయంత్రం పెద్దమండెం మండలంలో వెలుగు చూసిన ఘటనపై జిల్లా ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు, బాదితురాలు తెలిపిన వివరాలు... పెద్దమండ్యం మండలం, వెలిగల్లు పంచాయతీ, పడమటపల్లెకు చెందిన నాగిరెడ్డి భార్య జానకమ్మ(30),ను భర్త పట్టించుకోవడం లేదన్న బాధతో తీవ్ర మనస్థాపానికి గురైంది. చనిపోవాలని నిర్ణయించుకుని తనతో పాటు తన బిడ్డలను కూడా పరలోకాలకు తీసు కెళ్లాలని కఠినంగా మనసు మార్చుకుంది. కుమార్తె వర్షారెడ్డి(10)కి మరో ఐదేళ్ల కొడుకుకు జూ స్ లో విషం ఇచ్చి తాగమని చెప్పి ఆపై ఆమె కూడా తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబీకుల గమనించి బాధితులను వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. ఘటనపై ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసుల సమాచారంతో పెద్దమండెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### చైతన్య సంస్థ బ్లడ్ బ్యాంకు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్

# సంయుక్తంగా రక్తదాన శిబిరం ఏర్పాటు



**హిందూపురం టౌన్ -సూర్య వాస్తవం, జూన్ 14 :** హిందూపురం పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని గవర్నమెంట్ బ్లడ్ బ్యాంక్ నందు గవర్నమెంట్ బ్లడ్ బ్యాంకు మరియు చైతన్య సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డాక్టర్ దేవిడ్ రాజు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చరణ్ కుమార్ , చైతన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగిరెడ్డి ఉమర్ ఫరూక్ పాల్గొని ప్రసంగిస్తూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయంలో ఆపరేషన్ల సమయంలో తలసీమియా రోగులకు వివిధ సమస్యలతో రక్తం కోసం ఆసుపత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంకు కు వచ్చే పేద రోగులకు రక్తం కొరత లేకుండా వారు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల్లో కొనుక్కోకుండా వారికి ఉచితంగా రక్తం దొరికే విధంగా ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని పేర్కొనడం జరిగింది 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు మొదలుకొని 60 సంవత్సరాల వయసు వరకు రక్తదానం చేయవచ్చునని రక్తదానంపై అపోహలు విడనాడి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఎలాంటి జబ్బులు రుగ్మతలు దరిచేరవన్నారు.

రక్తదానం చేసిన వారికి బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆర్ ఎమ్ ఓ డాక్టర్ దేవిడ్ రాజు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చరణ్ కుమార్ ల్యాబ్ టెక్నీషియన్లు చైతన్య సంస్థ ప్రోగ్రాం మేనేజర్ తిప్పేస్వామి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏం ఈ ఏ నవీన్ కుమార్ , చైతన్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### వెలుగు సేవా సంస్థలో

# 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

## - దివ్యాంగుల యోగ సభ



**మదనపల్లి -సూర్య వాస్తవం, జూన్ 14 :** మదనపల్లి మండలం కోళ్ళ బైలు గ్రామ పంచాయితీ అమ్మచెరువు మిట్ట లో గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో భారత ప్రధాని మరియు రాష్ట్ర ముఖ్య మంత్రి, భారత ప్రభుత్వం సామజిక న్యాయం,సాధికారిత మంత్రిత్వ శాఖ వయో వృద్దులు , దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ ఆదేశాల మేరకు వెలుగు సంస్థ సెక్రటరీ యం. ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగా సమావేశ్ మే 21వ తేదీ నుండి జూన్ 21 వరకు నిర్వహించ బడుతొంది. ఇందులో భాగంగా శనివారం వెలుగు ప్రాంగణంలో సూర్యోదయం నందు నిర్వహించిన దివ్యాంగుల యోగ సభ కు ముఖ్య అతిథులు సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎన్. ముని గోపాల్ కృష్ణ, బిటి కళాశాల రిటైర్డ్ ప్రొఫసర్, కరస్పాండెంట్ వై.ఎస్ మునిరత్నం, డైట్ కళాశాల రిటైర్డ్ ప్రొఫసర్ శ్రీనివాసులు, రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. ధనలక్ష్మి, బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ ఫర్ఖాన్‌లు విచ్చేయగా పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యోగా మాసోత్సవాల్లో భాగంగా వెలుగు సంస్థలో దివ్యాంగుల యోగ సభ కు తమను ముఖ్య అతిథులుగా ఆహ్వా నించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో కొంత సమయం యోగాకు కేటా యించాలన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. యోగా మాస్టర్ డాక్టర్. అనితలక్ష్మి మాట్లాడుతూ యోగతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. ఆనందకరమైన జీవితానికి యోగా అవసరమనీ, వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లల నుంచి పెద్దలవరకు యోగాను ఆచరించాలని కోరారు. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ . ముని గోపాల్ కృష్ణ మాట్లాడుతూ యాంత్రిక జీవితంతో తీవ్ర ఒత్తిడికి గురౌతున్న ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత ఆరోగ్యానికి యోగాను అభ్యసించి ఆచరించా లన్నారు. ఈ ఒక్కరికి ఆరోగ్యమే మహా భాగ్యమని సూచించారు. అలాగే యోగా మాస్టర్ ఆధ్వర్యంలో వివిధ రకాల యోగాసనాలను చేయించి, యోగా శాంతిమంత్ర తో ముగించారు.తదుపరి దివ్యాంగులు యోగాసనాలతో నృత్య ప్రదర్శన చేసి అందరిని మంత్రముగ్దుల్ని చేశారు. బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ ఫర్ ఖాన్ , వారి సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించి వృద్దులకు రక్తపరీక్షలు చేసి, మందులను అందజేశారు. చివరిగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతిఒక్కరికి వాటర్ బాటిల్స్, రాగి జావ, బిస్కేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ వారి అక్షయ ధాత్రి ఎగువ కురవంక స్టడీ సెంటర్ టీచర్స్ , విద్యార్థులు, వెలుగు సెక్రటరీయం. ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ ఆర్. భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ పి. లీనా కుమారి, సోషల్ వర్కర్ యం.గీత,వార్డెన్ స్వీటీ, వెలుగు సిబ్బంది, వృద్దులు, పాల్గొన్నారు.



# యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం

## - వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్



**కర్నూలు - సూర్యవాస్తవం, జూన్ 14:** కర్నూలు జిల్లాకు పరిశ్రమలు తీసుకుని వచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని వాణిజ్యం అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు.శనివారం నాడు కర్నూలు పట్టణ ఉస్మానియా కాలేజీ ఆవరణలో నిర్మించిన రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్ష అభియాన్ (రూసా) ఆధ్వర్యంలో ఒక కోటి రూపాయలతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు అండ్ సిబ్బందిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ...ఉస్మానియా కళాశాల పూర్వపు విద్యార్థి అయిన నేను రాష్ట్ర మంత్రిగా రూసా నిర్మించిన అదనపు తరగతుల భవనాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాలలోని సిబ్బంది అందరితోనూ తనకు పరిచయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వారిలో చాలా మంది విదేశాల్లో స్థిరపడ్డారని, రాజకీయాల్లో కూడా బాగానే రాణిస్తున్నారని తెలిపారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ప్రిన్సిపాల్, కరస్పాండెంట్లు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి టీ.జీ.భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ఎస్ ఎస్ ముజామిల్, సెక్రటరీ, కరస్పాండెంట్ ఆజ్రా జావేద్, రూస ఇంచార్జ్ డాక్టర్ ఎస్.గజని, కార్పొరేటర్ పరమేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### హామీలు అమల్లో ఏడాదిలోనే

# కూటమి ప్రభుత్వం విఫలం

## - సూపర్ సిక్స్ ఎక్కడ.?

## - మదనపల్లె జిల్లా హామి ఏమైంది

## - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్



**మదనపల్లి -సూర్య వాస్తవం, జూన్ 14 :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ విమర్శలు గుప్పించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.... రైతులు, మహిళలు, యువతకు ఏ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడం లేదన్నారు. ముఖ్యంగా తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు కోత పెట్టడం దుర్మార్గమన్నారు. మదనపల్లి మెడికల్ కాలేజ్, మదనపల్లి జిల్లా, బి టి కళాశాలను యూనివర్సిటీ, కడప బెంగుళూరు రైల్వే లైన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏడాది పాలనలో ఇచ్చిన సూపర్ సిక్స్ పతకాలను అమలు చేయలేక చేతులు ఎత్తేశారని ఎద్దేవా చేశారు. అన్నదాత సుఖీభవ ఎప్పుడూ అని నీలదీదసారు. ఫ్రీ బస్సు పథకం అమలు చేయడానికి ఏడాది సరిపోలేదా అని ప్రశ్నించారు. కూటమి ఎన్నికల హామీల అమల్లో వైఫల్యంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేవలం పోలవరం, రాజధాని రెండే కాదని ప్రజలకు ప్రతిఒక్కటీ అవసరమేనని, పాలకులు రాష్ట్రంలో ఉన్న అన్ని సమస్యలపైనా ద్రుష్టి సా రించాలని కోరారు. మదనపల్లిని జిల్లా గా ప్రకటించి, మెడికల్ కళాశాలను త్వరిత గతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన తెలంగాణ మంత్రి సీతక్క



**రాప్తాడు -సూర్య వాస్తవం, జూన్ 14:** రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను తెలంగాణకు చెందిన పంచాయతీ రాజ్, స్త్రీ సంక్షేమశాఖ మంత్రి దన్సారీ అనసూయ అలియాస్ సీతక్క కలిశారు.హైదరాబాద్ లోని ఎమ్మెల్యే సునీత నివాసానికి మంత్రి వెళ్లారు. ఎమ్మెల్యే సునీతతో పాటు ఆమె కుటుంబ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం మంత్రి సీతక్క ఎమ్మెల్యే సునీత ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకున్నారు.ఆ తర్వాత పలు అంశాల గురించి చర్చించుకున్నారు. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న సమయంలో జరిగిన పలు అంశాల గురించి గుర్తు చేసుకున్నారు.ప్రస్తుతం తెలంగాణ,ఏపీ రాజకీయాల గురించి కూడా మాట్లాడుకున్నారు.స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రిగా గతంలో ఎమ్మెల్యే సునీత పని చేసిన నేపథ్యంలో అప్పటి పరిస్థితులు, ప్రజలకు అందించిన సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ జీవితంలో పేద వర్గాల కోసం పని చేయడంలో సీతక్కకు మించి ఎవరిని చూడలేదన్నారు.ఆమె కష్టమే ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. తమ మధ్య అప్పటి నుంచి బలమైన స్నేహం ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# యోగాంధ్రలో పాల్గొన్న డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 14:** యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారంనాడు నలక దొడ్డి, దేవనబండ గ్రామములలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామ ప్రజలకు యోగేంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు మాట్లాడుతూ..... యోగాంధ్ర భాగంలో దేవనబండ, నలగదొడ్డి గ్రామాలలోని బడులలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగినదని ప్రతి ఒక్కరూ ఈ యోగా దినోత్సవం అలవాటు చేసుకుని రోజు అలవాటు చేసుకొని తమ యొక్క ఆరోగ్యాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ప్రజలు విద్యార్థులు స్త్రీలు ఈ యోగా ద్వారా తమ ఆరోగ్యం చక్కబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు విద్యార్థులు విఆర్ఓ భాష తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## -ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు





**చెన్నూరు-సూర్య వాస్తవం, జూన్ 14:** వివిధ వయసుల వారికి యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు అన్నారు. శనివారం యోగా దినోత్సవం యోగాంధ్ర మాక్ డ్రిల్‌లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో ఉదయం 7 గంటల నుండి ఎనిమిది గంటల వరకు యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధి హామీ కూలీలకు యోగాతో వచ్చే ప్రయోజనాలు, ఆరోగ్య సంబంధిత విషయాలు గురించి ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు వివరించడం జరిగింది. అలాగే మండలంలోని రామన పల్లె గ్రామం పంచాయతీలో కార్యదర్శి గురువేశ్వరరావు ఆధ్వర్యంలో యోగాంధ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో అన్ని వయసుల పాల్గొని యోగా గురించి, యోగాతో మానసిక రుగ్మతలు ఏ విధంగా తొలగించుకోవచ్చో తెలుసుకోవడం జరిగింది. వీటన్నిటిని కూడా జియోటాగ్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధి కూలీలు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లికి వందనంతో తల్లుల అకౌంట్లో డబ్బులు

**- ప్రతి అమ్మ ముఖంలో ఆనందం**
**- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**




**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, జూన్ 14:** విద్యాశాఖ మంత్రి నారాలోకేష్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన తల్లులుఅదేవిధంగ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం మహిళలు పాలాభి సేకం చేశారు.

వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఒక్క విద్యార్థికి మాత్రమే జమ చేస్తే కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికి తల్లికి వందనం వర్తింపజేసిన కూటమి సర్కార్. పేదలకు అండగా ఉంటూ తల్లికి వందనం కూటమి ప్రభుత్వం వెంటే మహిళలలు అంటున్న టిడిపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్లాపురం సుజాత తల్లికి వందనం పథకం లో బాగంగా తల్లుల అకౌంట్లో డబ్బులు జమ కావడంతో ప్రతి అమ్మ ముఖంలో ఆనందంవెల్లివేరుస్తుందని టిడిపి జిల్లా మాజీ మహిళా ప్రధాన కార్యదర్శి బల్లాపురం సుజాత ,నసీబ్ జాన్ ,రమ్య, అంజలి తెలిపారు. నేడు రాయచోటిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమెను ఆద్వర్యంలో తల్లులు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఒక్క విద్యార్థికి మాత్రమే జమ చేస్తే కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికి తల్లికి వందనం




వర్తింపజేసిన ఘనత కూటమి సర్కార్ కు మాత్రమె దక్కుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలవడం తో పాటు మహిళల సంక్షేమానికి ఆధిక ప్రాదాన్యతిస్తుందని తెలుగు మహిళ విభాగం నేతలు పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వారి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అందరి పిల్లలకు తల్లికి వందనమిచ్చిన మాజీ సీఎం జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని వారు పేర్కొన్నారు. మహిళలకు పెద్ద పీట వేసిన కూటమి ప్రభుత్వానికే మా మహిళల మద్దతూ అని వారు పేర్కొన్నారు. వీరితో పాటు కార్యక్రమంలో తల్లికి వందనం నిధులు పడిన తల్లులూ వారి పిల్లలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం...



**హిందూపురం –సూర్య వాస్తవ, జూన్ 14:** పురం శాసన సభ్యులు పద్మభూషణ్ శ్రీ నందమూరి బాలకృష్ణగా ఆదేశాల మేరకు తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లులు ఖాతాల్లోకి నగదు జామ అయిన సందర్భంగా పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ నందు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిత్ర పటాలకు జరిగిన పాలాభిషేకం కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. అనంతరం వారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి, కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, బీజేపీ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు

**- వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు**

**సిద్దవటం – సూర్య వాస్తవం, జూన్ 14:** ? సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చెయ్యడంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అని వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు సింగం కృష్ణారెడ్డి ఆరోపించారు. మండలంలోని టక్కోలులో శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగానికి, రౌడీయిజానికి స్వస్తి పలకాలన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంప దెబ్బ పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది అసమర్థ పాలనలో సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజల దృష్టిని మల్లించేందుకు కొమ్మినేని అక్రమ అరెస్టు చేసి పత్రికా స్వేచ్ఛకు బంగం కలించారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో కూటమి ప్రభుత్వం అరాచకాలు, పచ్చ రౌడీ మూకలు విధ్వంసాలు చేస్తుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన తెలిపారు.

# విమాన ప్రమాద ఘటన దురదృష్టకరం

**- మృతులకు సానుభూతి తెలిపిన జిల్లా బీసీ సంఘం అధ్యక్షురాలు పద్మజ యాదవ్**



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, జూన్ 14:** అహ్మదాబాదు విమాన ప్రమాదం చాలా దురదృష్టకరం అని అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షురాలు పద్మజ యాదవ్ అన్నారు. ఈ దురదృష్టకర సంఘటనలో మృతి చెందిన వారికి ఆమె ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో భారత్ తో పాటు విదేశీయులు, వైద్యులు, వైద్య విద్యార్థులు మృతి చెందడం ఎంతో దురదృష్టకరమని పేర్కొన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు కన్నీటి నివాళి అర్పిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని కోరుకుంటున్నామన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. విమాన ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. విమాన ప్రమాదంలో డాక్టర్లు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం హృదయ విధానకరం అన్నారు.మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# విమాన ప్రమాద మృతులకు కన్నీటి నివాళి

**- మృతులకు కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సానుభూతి**

**- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ కె బాషా**




**మదనపల్లి –సూర్య వాస్తవం, జూన్ 14:** అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ కె బాషా స్థానిక కోట వీధి లోని మస్తాన్ వలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగిందని తెలిపారు. శనివారం ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇలాంటి ప్రమాదాలు ఎప్పుడు పునరావృతం కాకూడదని ప్రార్థించడం జరిగిందని తెలిపారు. విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో భారత్‌తో పాటు విదేశీయులు, వైద్యులు, వైద్య విద్యార్థులు మృతి చెందడం ఎంతో దురదృష్టకరమని పేర్కొన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు కన్నీటి నివాళి అర్పిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని కోరుకుంటున్నామన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. విమాన ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. విమాన ప్రమాదంలో డాక్టర్లు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం హృదయ విధానకరం అన్నారు.మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య



**మదనపల్లి –సూర్య వాస్తవం, జూన్ 14:** పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లి పట్టణంలో వెలుగు చూసింది. రెండవ పట్టణ ఎస్ఐ రహీముల్లా కథనం మేరకు.. కమ్మగడ్డ వీధిలోని గుర్రప్ప నాయుడు వీధిలో కాపురం ఉంటున్న ఆదినారాయణ కుమారుడు లోకేష్ 30 స్థానిక సంఘం ఫంక్షన్ హాల్ వద్ద ఓ కంపెనీలో పని చేస్తాడు. రెండు రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బాధితుల్ని కుటుంబీకులు బెంగళూరుకు తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో చేసేదిలేక తిరిగి మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రి లో అతను మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది .

# తల్లికి వందనం అమలు పెద్దహుల్తి లో సంబరాలు

**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, జూన్ 14:** కూటమి ప్రభుత్వం ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం నిధులు జమచేయడంతో పెద్దహుల్తి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం నాడు సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, పత్తికొండ ఎమ్మెల్యే కె శ్యాంబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం నిధులు వచ్చాయని టిడిపి సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి , పరిపూర్ణ గౌడ్, కారుమంచి, రంగస్వామి ,రంగన్న ,అశోక్, హరి, సంతోషం వ్యక్తం చేశారు. బాణాసంచా పేల్చి పిల్లలతో కలిసి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



# చంద్రబాబు నాయుడు పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం



**హిందూపురం టౌన్ –సూర్య వాస్తవం, జూన్ 14 :** హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లులు ఖాతాల్లోకి నగదు జామ అయిన సందర్భంగా పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ నందు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిత్ర పటాలకు పాలాభిషేకం కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ డి ఈ రమేష్ కుమార్ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు అనంతరం చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేసారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన పార్టీ నాయకులు బీజేపీ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వాస్థ్య హాస్పిటల్ రక్తదాన శిబిరానికి విశేష స్పందన







**మదనపల్లి –సూర్య వాస్తవం, జూన్ 14 :** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ్య హాస్పిటల్, లయన్స్ క్లబ్, ప్రభుత్వ రక్తనిది కేంద్రం సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నక్కల దిన్నె స్వాస్థ్య హాస్పటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి రక్త దాతలు నుండి అపూర్వ స్పందన లభించిందని స్వాస్థ్య హాస్పిటల్ వైద్యులు తెలిపారు. అంతేకాకుండా రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు, యువత కు వివరించారు. రక్త దానం ఆవశ్యకత పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండటం తో పాటు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఒక్కరు రక్త దానం చేయడం ద్వారా ముగ్గురికి ప్రాణాలను కాపాడగలిగిన వారవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, లయన్స్ క్లబ్ హార్స్ హిల్స్ సభ్యులు పాల్గొన్నారు.

# రక్తదానం చేద్దాం..ప్రాణదాతలవుదాం

**- చరణ్‌ను రక్తదాత అవార్డుతో సత్కరించిన యువస్పందన సొసైటీ..**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, జూన్ 14:** శనివారం నాడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా యువస్పందన రక్త దాత అవార్డుకు ఎంపిక చేసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా యువస్పందన సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సురేంద్ర, లక్ష్మణ్ మాట్లాడుతూ... మనిషి జీవితంలో రక్తం చాలా ముఖ్యమైనది రక్త దానం చేయడం వలన ఎంతో మందికి ప్రాణ దానం చేసినవరవుతారని అన్నారు. అలాగే పత్తికొండకు చెందిన ఎన్. చరణ్ స్వచ్ఛందంగా 9 సార్లు కర్నూలు, హైదరాబాద్ వంటి ప్రదేశాలకు వెళ్లి రక్తదానం చేయడం అభినందనీయం అని స్వచ్ఛందంగా చేస్తున్న నిస్వార్ధ సేవకుగాను యువస్పందన సొసైటీ గుర్తించి ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా యువస్పందన రక్త దాత అవార్డుతో చరణ్ గకి యువస్పందన అధ్యక్షుడు సురేంద్ర చేతుల మీదుగా సన్మానించడం జరిగిందని తెలిపారు. ఇదేవిధంగా లిరక్త దానంపై యువత అపోహలు వీడి ముందుకు వచ్చి రక్తదాతలుగా మారాలని పిలుపునిచ్చారు. అలాగే సన్మాన గ్రహీత చరణ్ తన సేవలు గుర్తించి అవార్డును అందించిన యువస్పందన సొసైటీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువస్పందన సభ్యులు మధు, రమేష్, రాజేశ్వరి, వీరేశ్ లు పాల్గొన్నారు.

# నూతనంగా బాధ్యతలు తీసుకున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

**- కమీషనర్ తో కౌన్సిలర్ల ఆత్మీయ సమావేశం**




**హిందూపురం –సూర్య వాస్తవం, జూన్ 14: హిందూపురం** మున్సిపాలిటీ కి కొత్త కమిషనర్ తమ పరిచయాలు అనంతరం కౌన్సిలర్స్ అందరూ తమ వార్డులలో ఉన్న సమస్యల గురించి చర్చించడం జరిగినది. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ డి ఇ రమేష్ మాట్లాడుతూ ప్రతి నెల కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని, వార్డులలో జరిగే పనులలో భాగంగా ఆ వార్డు కౌన్సిలర్ కి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎంఎల్ఏ ఆదేశానుసారం ప్రతి వార్డులలో ఉన్న రోడ్లు, కాలువలు, లైటింగ్, పారిశుధ్యం, నీటి సమస్యల గురించి వార్డు వార్డు తిరిగి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# 38 ఏళ్లు తేడా.. ఓకేనా మృణాల్?



యంగ్ హీరోయిన్స్, అప్‌కమింగ్ హీరోయిన్స్ సీనియర్ హీరోలతో నటించేందుకు ఒకింత వెనకడుగు వేస్తున్నారు. స్టార్ హీరోలు అయితే, కథ డిమాండ్ చేస్తే, భారీ పారితోషికం డిమాండ్ చేస్తే తప్ప సీనియర్ హీరోల సినిమాల్లో యంగ్ హీరోయిన్స్ నటించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ఇటీవల ఒక తెలుగు స్టార్ హీరోల సినిమాలో ఒక హీరోయిన్ నటించేందుకు గాను ముందు నో చెప్పిందని, కానీ భారీ పారితోషికం ఆఫర్ చేయడంతో ఓకే చెప్పిందనే పుకార్లు షికార్లు చేశాయి. కానీ కొందరు హీరోయిన్స్ మాత్రం ఎంత స్టార్‌డం ఉన్నా కొందరు సీనియర్ హీరోలతో నటించాలని కోరుకుంటూ ఉంటారు. తమ అభిమాన హీరోలు వారు అని, వారితో ఒక్క సినిమా చేసే అవకాశం వచ్చినా చాలని అంటూ ఉంటారు.

తాజాగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ఒక ఇంటర్వ్యూలో అదే తరహా వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి కమల్ సర్ అంటే చాలా అభిమానం, ఆయన సినిమాలు చాలా చూశాను, చాలా కాలం నుంచి ఆయనతో నటించాలని ఉంది. ఆయన సినిమాలో చిన్న పాత్ర లభించినా చాలు అన్నట్లుగా మృణాల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ మధ్య కాలంలో సీనియర్ హీరోలు వయసుతో సంబంధం లేకుండా హీరోయిన్స్‌తో రొమాన్స్ చేస్తున్నారు. ఇటీవల కమల్ హాసన్ థగ్ లైఫ్ లో చేసిన రొమాన్స్ వివాదాస్పదం అయింది. మీ వయసులో కనీసం సగం కూడా లేని అమ్మాయితో ఇలా రొమాన్స్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ప్రశ్నించారు.

ఇదే తరహా ప్రశ్న బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్‌కి సైతం ఎదురు అయింది. కూతురు వయసు ఉన్న అమ్మాయిని మీ సినిమాలో హీరోయిన్‌గా ఎలా నటింపజేస్తారు అంటూ ప్రశ్నించిన వారు చాలా మంది ఉన్నారు. దాని ఆయన స్పందించారు కూడా.. ఏఐ టెక్నాలజీతో తన వయసు తగ్గించారు అన్నట్లుగా చమత్కరించాడు.

మొత్తానికి సీనియర్ హీరోలకు హీరోయిన్స్ పెద్ద సమస్యగా ఉన్న సమయంలో మృణాల్ ఠాకూర్ అలా మాట్లాడటం చర్చనీయాంశం అయింది. ప్రస్తుతం కమల్ ఒక భారీ యాక్షన్ సినిమాకు రెడీ అవుతున్నాడు. ఆ సినిమాలో మృణాల్ ఠాకూర్ ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నా యని, సీనియర్ హీరోలకు హీరోయిన్స్ లోటు ఉన్న సమయంలో మృణాల్ వంటి స్టార్ హీరోయిన్స్ ఇచ్చిన ఆఫర్‌ను ఏ దర్శకుడు వదిలి పెట్టడు. మృణాల్ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతోంది.



# సినీ నటుడు అల్లం గోపాలరావు మృతి

తెలుగు సినీ పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ నటుడు, టీవీ ఆర్టిస్ట్ అల్లం గోపాలరావు(75) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం 8 గంటలకు తన నివాసంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో తెలుగు, సినీ, టీవీ రంగాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయనకు భార్య విమల, ఇద్దరు కుమారులు అనిల్, సునీల్ ఉన్నారు. పెద్ద కుమారుడు అనిల్ ఇప్పుడు సీరియల్స్ లో నటిస్తున్నారు. మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. గోపాలరావు భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు పలువురు సినీ, టీవీ ప్రముఖులు ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) మేనేజ్మెంట్ కమిటీ గోపాలరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఆయన అంత్యక్రియలు ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు మహాప్రస్థానంలో జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

**అల్లం గోపాల్ రావు సీరియల్స్..**

అల్లం గోపాలరావు 'గుప్పెడంత మనసు' సీరియల్ లో మినిస్టర్ పాత్రలో నటించారు, రిషికి , రిషి కుటుంబానికి అండగా ఉంటూ అన్ని విధాల ప్రోత్సహించే మంత్రి పాత్రలో ఈయన చాలా చక్కగా నటించారు. ఇకపోతే ఇటీవలే ఈ గుప్పెడంత మనసు సీరియల్ ముగిసిన విషయం తెలిసిందే. ఇందులోనే కాదు బ్రహ్మముడి సీరియల్ లో ఆయన జడ్జిగా కామెడీ పాత్ర చేశారు. అనామిక - కళ్యాణ్ విడాకుల కేసుకు సంబంధించిన ఎపిసోడ్లు న్యాయమూర్తిగా అందరి దృష్టిని ఆకట్టుకున్నారు.

# జులైలో ఆఫ్రికా అడవులకు 'మహారాజ్'

మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకుడు రాజమౌళి తీస్తున్న చిత్రం పనులు స్పీడ్ అందుకున్నాయి. కొద్దిరోజుల క్రితం ఒడిసాలో చిత్రీకరణ జరుపుకున్న ఈ భారీ ప్రాజెక్ట్ అక్కడ కొన్ని కీలక సన్నివేశాలతోపాటు, యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్ర యూనిట్ ఇప్పుడు ఆఫ్రికాలోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లనుంది. కథ రీత్యా ఈ సినిమాలోని అత్యంత కీలకమైన చిత్రీకరణలు ఇక్కడ షూట్ చేయనున్నారు. జులైలో కెన్యాకు చిత్ర యూనిట్ పయనం కానుంది. మసాయి-పిగ్మీస్ తెగలతో ఇప్పటికే మహేశ్‌బాబు కొద్దిరోజులు గడిపారు. ఆ ప్రాంతపు యుద్ధ విద్యలపై బేసిక్ స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్టుగా సమాచారం. దాదాపు 30రోజుల పాటు జరగనున్న షూటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది చిత్ర యూనిట్. అక్కడి ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్‌లో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లుగా తెలుస్తోంది. కెన్యాలో జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. మహేశ్‌తోపాటుగా పృథ్వీరాజ్ సుకుమార్‌తో పాటు మరికొందరు అక్కడ షుటింగ్‌లో పాల్గొననున్నారు. ఇక ఈ సినిమాకు 'మహారాజా', 'మహారాజ్' అనే టైటిల్స్‌ను అనుకుంటున్నారని ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. దుర్గా ఆర్ట్స్‌పై







# సురుచి సింగ్‌కు స్వర్ణం ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్

**మ్యూనిచ్ (జర్మనీ) -సూర్యవాస్తవం :**

భారత యువ షూటర్ సురుచి సింగ్ (19) ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ సాధించింది. కెరీర్‌లో మూడోసారి ప్రపంచకప్‌లో గన్ గురి పెట్టిన సురుచి సింగ్ మూడో బంగారు పతకం సాధించింది. జర్మనీలోని మ్యూనిచ్‌లో జరుగుతున్న షూటింగ్ ప్రపంచకప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం ఫైనల్లో 0.2 పాయింట్ల తేడాతో ఫ్రాన్స్ షూటర్ కామిలెపై పైచేయి సాధించిన సురుచి సింగ్ ఫోగట్ పసిడి పతకం ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది బ్యూఎయిర్స్, లిమా ప్రపంచకప్‌లోనూ సురుచి సింగ్ పసిడి పతకాలు సాధించింది. ఫైనల్లో సురుచి సింగ్ 214.9 పాయింట్లు సాధించగా.. కామెలె 241.7 పాయింట్లు సాధించింది. చైనా షూటర్ 221.7 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. మను భాకర్ పతక పోరుకు అర్హత సాధించలేదు.

# చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా...

## - తొలిసారిగా ఐసీసీ టెస్టు గద కైవసం
## - దక్షిణాఫ్రికా ఖాతాలో తొలి ఐసీసీ మేజర్ టైటిల్




దక్షిణాఫ్రికా క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించబడింది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ఐసీసీ మేజర్ టైటిల్ కలను సఫారీ జట్టు ఎట్టకేలకు నిజం చేసుకుంది. లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానం వేదికగా జరిగిన ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 ఫైనల్లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసి, తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది. ఇప్పటివరకు పలు ఐసీసీ ఈవెంట్లలో సెమీస్, ఫైనల్స్ వరకు వచ్చి చతికిలపడిన దక్షిణాఫ్రికా, ఈ విజయంతో తమపై ఉన్న "చోకర్స్" ముద్రను చెరిపేసుకుంది. ఈ చారిత్రక విజయంలో ఓపెనర్ ఐడెన్ మార్క్రమ్ (136) అద్భుత శతకంతో కీలక పాత్ర పోషించాడు.

**మార్క్రమ్ వీరోచిత శతకం... బవుమా అండ**

జూన్ 11న ప్రారంభమైన ఈ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజైన జూన్ 14న ముగిసింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 285 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా, ఐడెన్ మార్క్రమ్ వీరోచిత బ్యాటింగ్‌తో సునాయాసంగా విజయాన్ని అందుకుంది. మార్క్రమ్ 207 బంతుల్లో 14 ఫోర్లతో 136 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించాడు. అతనికి కెప్టెన్ టెంబా బవుమా (134 బంతుల్లో 66 పరుగులు, 5 ఫోర్లు) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. చివర్లో డేవిడ్ బెడింగ్‌హామ్ (21 నాటౌట్), కైల్ వెర్రెయిన్ (7 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3 వికెట్లు పడగొట్టగా, హేజిల్‌వుడ్, కమిన్స్ తలో వికెట్ తీశారు.

**మ్యాచ్ ఎలా సాగిందంటే...**

ఈ మ్యాచ్ లో, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకు కట్టడి చేసింది. ఆసీస్ బ్యాటర్లలో బ్యూ వెబ్‌స్టర్ (72), స్టీవెన్ స్మిత్ (66) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబడ 5 వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది.

ఆసీస్ బౌలర్ల ధాటికి 138 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ బెడింగ్‌హామ్ (45), టెంబా బవుమా (36) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ 6 వికెట్లతో సత్తా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల ఆధిక్యం లభించడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించినా, దక్షిణాఫ్రికా బౌలర్లు పుంజుకున్నారు. దీంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకే ఆలౌట్ అయింది. మిచెల్ స్టార్క్ (58 నాటౌట్) ఒంటరి పోరాటం చేయగా, అలెక్స్ కేరీ (43) అతనికి సహకరించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడ 4 వికెట్లు, లుంగి ఎంగిడి 3 వికెట్లు పడగొట్టి ఆసీస్‌ను దెబ్బతీశారు. అనంతరం, 285 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా అద్భుతంగా ఆడి చిరకాలంగా ఊరిస్తున్న ఐసీసీ మేజర్ ఈవెంట్ విజేతగా నిలవాలన్న కల నెరవేర్చుకుంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా క్రికెట్ అభిమానుల దశాబ్దాల నిరీక్షణ ఫలించింది. ఐసీసీ టోర్నమెంట్లలో కీలక సమయాల్లో ఒత్తిడికి లోనై ఓడిపోతుందన్న అపవాదును ఈ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజయంతో సఫారీ జట్టు తుడిచిపెట్టుకుంది. మార్క్రమ్ "ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్"గా నిలిచాడు.

## సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపిన
# మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

### - విజయవాడ క్యాంప్ కార్యాలయంలో ?
### ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి మండిపల్లి





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం ,జూన్ 14:** రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయవాడ క్యాంప్ కార్యాలయంలోప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను సమీక్షించి తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు.

# మైనర్లు వాహనం నడిపితే.... తల్లిదండ్రులే బాధ్యులు

### - ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి...
### - అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్





**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 14:** ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ తెలిపే అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ .సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ లకు దూరంగా ఉండాలన్నారు.పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు.మైనర్ల వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందనీ కావున తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలియజేశారు.జాతీయ రహదారులపై రాంగ్ రూట్ లలో వెళ్ళవద్దని తెలిపారు.అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు ఫైన్లు వేశారు.

# కాశీ ,అయోధ్యలో భరత నాట్య ప్రదర్శన




**గుత్తి –సూర్య వాస్తవం,జూన్ 14:**
గుత్తి పట్టణంలోని అరవింద్ ఆ ర్ట్స్ అకాడమీ కి చెందిన సురేష్ మాస్టర్ శిష్య బృందం చిన్నారులు సంధ్య శ్రీ,హర్షిత,సాయి తేజ స్విని,దాక్షిణ్య దీక్ష, వరేణ్య వీక్ష , సాయి చెర్విత అక్షయ సోషల్ క ల్చరల్ అసోసియేషన్ హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తే దిన కాశీలో శ్రీ కాశీ విశ్వనాథుని సన్నిధిలో,10వ తేదీన అయోధ్య నగరంలో శ్రీబాలరాముని క్షేత్ర సన్నిధిలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పా ల్గొని కళా విద్వాంసుల, ప్రేక్షకుల మన్ననలను పొందారు ఆలయ కమిటీ చిన్నారులకు ప్ర శంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.మన గుత్తి ప్రాంతానికి గర్వకారణం అయ్యా రు.



## ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు
# పాలాభిషేకం చేసిన పామిడి జనసైనికులు



**పామిడి– సూర్య వాస్తవం,జూన్ 14:**
అధికారంలోకి వస్తే అందరికీ మంచి చేస్తాంఅని చెప్పి రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతోనే సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టింది అందులో భాగంగానే తల్లికి వందన పథకానికి అందరికీ డబ్బులు జమ చేస్తామని చెప్పి చేసి చూపించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విష ప్రచారాలు మానుకోవాలని పాత్రికేయుల సమావేశంలో శనివారం రోజున పామిడి పట్టణంలో ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు అనంతరం జనసైనికులు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతి ఒక్కరికి మంచి చేయాలను ఉద్దేశంతోనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అయితే అందరికీ జరుగుతున్న ఉద్దేశంతోనే బాబు నాయుడు అడుగుజాడల్లో నడుచుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తున్న నాయకుడు కళ్యాణ్ కొంతమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధి చూసి ఓర్వలేక విష ప్రచారాలు చేస్తున్నారు ఇప్పటికైనా విష ప్రచారాలు మానుకొని చూసి ఆనందించండి ఎందుకంటే గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమ్మబడి అనే పేరుతో ఇంటికి ఒకరికి లబ్ధి చేకూరుస్తే ప్రభుత్వం లబ్ధి కురుస్తామని చెప్పారు చేసి చూపించారు గతంలో కొంతమంది ఎక్కడో డబ్బులు పడ్డాయో లేదో అని అనుమానాలు ఉండేవే ఇప్పుడు పామిడి పట్టణంలోనే కుటుంబంలో ఐదు మందికి అకౌంట్లో డబ్బులు జమ కావడంతో వారు సంతోషాలు హద్దులు లేకుండా పోయా ఎందుకంటే అమ్మబడు ఒకరికి ఇచ్చి ఇంట్లో చాలామంది కష్టాలు పడేవారు ఇప్పుడు మాత్రం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ న్యాయం ఖాయం ఎందుకంటే రాబోయే రోజుల్లో సూపర్ సిక్స్ బతకాలో కచ్చితంగా నెరవేరుస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శరత్ ప్రధాన కార్యదర్శులు జగదీష్ షేక్షావలి జనసేన పార్టీ నాయకులు వడ్డే రాము జమీర్ కత్రిమల సుబ్బు లాయర్ సతీష్ సూర్య ఆటో సిద్ద మధుసూద చిన్న అశోక్ అబ్దుల్ వెంకటరెడ్డి కుల్లాయప్ప హోటల్ సాయి జనసేన పార్టీ నాయకులు కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# రక్త దానం అంటే.. మరొకరికి ప్రాణం పోయడమే ..

### -అఖిల భారత చిరంజీవి అభిమానులు

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 14:** రక్తం అందక ఎవరూ మృతి చెందకూడదు.. అత్యవసర సమయంలో మనం చేసే రక్తదానం ఒక ప్రాణాన్ని నిలబెడుతుంది.. అందరూ రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి.... అని మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఇచ్చిన పిలుపు మేరకు....రక్తదాతల దినోత్సవం సందర్భంగా అఖిలభారత చిరంజీవి యువత అధ్యక్షులు రవణ%శీ% స్వామి నాయుడు ,రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షులు భవాని రవికుమార్ ఆదేశాల మేరకు రామ్ చరణ్ ఫాన్స్ జిల్లా అధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో శనివారం నాడు అనంతపురంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో మెగా రక్తదాన దినోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కాపు భారతి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మెగా అభిమానులు ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత యువత నాయకులు చంద్రమౌళి, రాష్ట్ర చిరంజీవి ఉపాధ్యక్షులు చలపతి ఉప్పరపల్లి శివారెడ్డి గారు అక్కిరాజు సాగర్ గారు రామ్ చరణ్ అభిమానులు వెంకీ,చరణ్, శామీర్, సురేశ్, గోపాల్, నాగేంద్ర తిమ్మప్ప, జనసైనికులు పాల్గొని రక్తదానం చేయడంజరిగింది.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్: డిఎస్పీ

### - 20 లక్షల బంగారు వెండి ఆభరణాలు సీజ్..





**మదనపల్లె –సూర్య వాస్తవం, జూన్ 14:**
అన్నమయ్య జిల్లాలో పట్టపగలే తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు శనివారం అరెస్టుచేశారు. నిందితుల అరెస్టుకు సంభందించి మదనపల్లె డిఎస్పి మహేంద్ర సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె, కురబలకోట మండలాల్లో ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఆరుగురిని కురబలకోట మండలం, చేనేత నగర్ బస్ స్టాప్ వద్ద ఈనెల 14న ఆరుగురు అనుమానస్పద స్థితిలో ఉండగా వెళ్లి పట్టుకుని వారి వద్ద 20 లక్షల విలువ చేసే, 150 గ్రాముల బంగారం, 762 గ్రాముల వెండి ఆభరణాలు, రూ. 5,28 లక్షల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు అనంతరం అరెస్టు చేశామన్నారు.

అరెస్టు అయిన వారిలో మదనపల్లి టిఎన్ఆర్ కాలనీకి చెందిన మౌలాలి అలియాస్ బాబు 52, కర్ణాటక రాష్ట్రం చింతామణి జోగుల గడ్డకు చెందిన శంకర్ 48, కురపలకోట నందిరెడ్డిగారి పల్లికి చెందిన నరసింహులు45, మదనపల్లి బొమ్మన్చెరు పాకాల వారి పల్లికి చెందిన నవీన్ కుమార్ 30, కృపలకోట చింతమకులపల్లికు చెందిన అనంత విశ్వనాథరెడ్డి 65, గంగవరం మండలం, మాడుగురుకు చెందిన నిరుగట్టి రమేష్ 44లు తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవారని చెప్పారు. నిందితులను పట్టుకోవడానికి ప్రతి భ కనబరసిన మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, క్రైమ్ సీఐ చంద్రశేఖర్, ముదివేడి ఎస్ఐ దిలీప్ కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించి క్యాష్ రివార్డులను అందజేశారు.

# కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట: నెలవల

### - పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మితమైన అదనపు నూతన భవనం ప్రారంభోత్సవం



**పెళ్లకూరు – సూర్య వాస్తవం, జూన్ 14:** రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అధిక నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉచితంగా రక్త పరీక్షలు వంటి సేవలూ అందిస్తున్నట్లు ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రజలకు సురక్షిత, సమర్థవంతమైన ఆరోగ్య సేవలందించడంలో ఆశ, ఆరోగ్య సిబ్బంది చిత్తశుద్ధితో, సేవాధర్మంతో పని చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయ్‌శ్రీ పిలుపునిచ్చారు. శనివారం పెళ్లకూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు భవనాన్ని ఆమెతో పాటు సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రమణ్యం కలసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్యాధికారి డా. బాలకృష్ణ నాయక్, అదనపు డిఎం , వాచ్వో శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌హెచ్‌ఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ....**

గ్రామీణ ప్రజలకు సమయానికి వైద్య సేవలు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. గర్భిణీలు గర్భధారణ నుంచి ప్రసవం వరకు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పిల్లల ప్రాథమిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టీకాల వలన ప్రాణాంతక వ్యాధులను నిరోధించవచ్చన్నారు.క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు.ఆశ, ఏఎన్ఎంలు తమ పరిధిలో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను చేరవేయాలని సూచించారు.గ్రామీణ ఆరోగ్య కేంద్రంకి రోగులను చైతన్యపరచి పంపే బాధ్యత ఆశ కార్యకర్తలదని పేర్కొన్నారు.

# నీట్-యుజి ఫలితాలు

### - రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్
### - తెలంగాణ, ఆంధ్రాకు విద్యార్థులకు 18,19 ర్యాంకులు

**న్యూఢిల్లీ–సూర్య వాస్తవం, జూన్ 14:**
దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్) అండర్ గ్రాడ్యుయేట్ (యుజి) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా 22,09,318 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,36,531 మంది అర్హత సాధించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తెలిపింది. ఈ ఫలితాల్లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్ కుమార్ ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ రెండో ర్యాంక్, మహారాష్ట్రకు చెందిన కృషంగ్ జోషి మూడో ర్యాంక్ సాధించి తమ సత్తా చాటారు. మహిళల విభాగంలో ఢిల్లీకి చెందిన అవికా అగర్వాల్‌కు తొలి ర్యాంకు దక్కింది. తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్ సాయి కుమార్ 18వ ర్యాంకు సాధించగా, ఆంధ్రాకు చెందిన దర్బా కార్తీక్ రామ్‌కు 19వ ర్యాంకు దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుండి 36,776 మంది విద్యార్థులు, తెలంగాణ రాష్ట్రం నుండి 41,584 మంది విద్యార్థులు అర్హత సాధించారు. తెలంగాణకు చెందిన షణ్ముఖ్ నిషాంత్‌కు 37, మంగారి వరుణ్‌కు 46, యంద్రపాటి షణ్ముక్‌కు 48వ ర్యాంకు వచ్చింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్‌కు 56వ ర్యాంకు, దేసిన సూర్యచరణ్‌కు 59, పొదిలపు అవినాశ్‌కు 64వ ర్యాంకు, యర్రా సమీర్‌కుమార్‌కు 70వ ర్యాంకు వచ్చింది. తుమ్మూరి శివ మణిదీప్‌కు 92వ ర్యాంకు దక్కింది. తెలంగాణకు చెందిన బిదీష మాఝి 95వ ర్యాంక్ సాధించింది. విద్యార్థులు వ్యక్తిగత లాగిన్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే వారి ఈ–మెయిల్‌కు స్కోర్ కార్డులు పంపుతున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )